క్లుప్తంగా

మహాసభను జయప్రదం చేయాలి



తాడేపల్లి రూరల్: ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న సీపీఐ తాడేపల్లి ప్రాంత మహాసభను జయప్రదం చేయాలని పార్టీ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి ప్రాంత మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి ముసునూరు సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు షేక్ బాషా, ప్రసాద్, కూరపాటి సింగయ్య, కంచర్ల దుర్గారావు, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



మంగళగిరి: పట్టణంలో పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారికి వైభవంగా శాకంబరీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆదివారం మహిళలు పొంగళ్లను అమ్మవారికి సమర్పించి గ్రామోత్సవం చేశారు. కాయగూరలతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మంగళగిరి: నగర పరిధిలోని జాతీయ రహదారి వెంట గల శ్రీ కనకదుర్గ ఆలయంలో ఆదివారం శాకంబరీ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని పండ్లు, కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే ప్రతిఘటించాలి

తాడేపల్లి రూరల్: స్మార్ట్ మీటర్లు వద్దని వివరిస్తూ తాడేపల్లి పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆదివారం నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కరెంటు ఛార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గించక పోగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో అదనపు భారం మోపుతోందని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుందరయ్య నగర్ కార్యదర్శి నాగేశ్వరరావు, ఎస్‌కే బాష, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌పై దాడి హేయమైన చర్య



దుగ్గిరాల: రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని.. బీసీ మహిళ అని కూడా చూడకుండా అత్యంత దారుణంగా దాడి చేయటం సరికాదని.. దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ అన్నారు. దుగ్గిరాల రైలుపేటలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఆదివారం మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతుందని, బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమానికి వస్తున్న కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. కార్యక్రమంలోఉప్పాల ఆనంద్ బాబు, ఉప్పాల శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, డి.ధనుంజయ్, బీసీ సంఘం, గౌడ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మరణించిన ఘటన తాడికొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన శృంగారపాటి సాంబయ్య(36) మిత్రుడు ఆరేపల్లి జోజితో కలిసి శనివారం గుంటూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అడ్డరోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సాంబయ్య ఆదివారం మరణించాడు. మృతిడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

రైతన్నకు నకిలీ విత్తనాల దెబ్బ!

- నిండా మునిగిన రైతు
- కలెక్టర్‌కు ఫిర్యాదు.. అయినా స్పందన కరువు
- నష్ట పరిహారాన్ని ప్రభుత్వమే అందించాలంటూ డిమాండ్



పలుచగా మొలకెత్తిన మొక్కజొన్న పంట

తాడేపల్లి రూరల్: ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే.. గిట్టుబాటు ధర లేక రైతు ఒక పక్క తీవ్ర ఇబ్బందులకు గురవుతుంటే.. మరో పక్క నకిలీ విత్తనాలతో రైతులు నిండా మునిగి అప్పుల బాధతో నష్టపోతున్నారు. తాజాగా మెల్లంపూడికి వలస వచ్చిన రైతు మొక్కజొన్న విత్తనాలు కొని, పంట వేయగా మొక్కలు రాకపోవడంతో అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి ఎటువంటి న్యాయం జరగకపోవడంతో మొక్క మొలవని ఆ పంట పొలాన్ని దున్నేందుకు సిద్ధమయ్యాడు. తాను మోసపోయినట్లు ఏ రైతూ మోసపోకూడదని, తనలా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలంటూ రైతు డిమాండ్ చేశారు.



నకిలీ విత్తనాల కవరును చూపిస్తున్న రైతు

నమ్మించి.. మోసగించి..

తెనాలి మండలం బుర్రిపాలెంకు చెందిన సందు సుబ్బారావు అనే రైతు అక్కడ నుంచి వచ్చి తాడేపల్లి రూరల్ మెల్లెంపూడిలోకి 8 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. తొలకరి రావడంతో 4 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 4 ఎకరాల్లో కంద, చేమ వేశాడు. మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసేందుకు విజయవాడలోని శ్రీనివాస సీడ్స్ వారిని సంప్రదించాడు. రైతు సుబ్బారావుకు తరచూ వాడే మొక్కజొన్న విత్తనాలతో పాటు 'కొత్తగా వచ్చింది, బాగా పంట దిగుబడి వస్తుందని' హైవెజ్ అనే పేరుతో ఉన్న స్వీట్‌కార్న్ మెరిట్ పేరు గల ప్యాకెట్‌లను ఒక్కో బ్యాగ్ రూ.2,500 చొప్పున విక్రయించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతు జానెకు ఒక విత్తనం నాటగా పల్చగా వచ్చాయని.. ఇదేమని కంపెనీ వారిని ఫోన్‌లో సంప్రదించగా 4 రోజులు తరువాత వచ్చి చూసి వెళ్లిపోయారని తెలిపారు.

స్పందించని అధికారులు..

జరిగిన ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశాడు. విత్తనాలు కొనుగోలు, దుక్కి దున్నడం, విత్తనాలు నాటడం, బోదులు ఏర్పాటు చేయడం, పై మందులు, బలానికి మందులు కలిపి మొత్తం రూ.21,750 అయ్యిందని వాపోయాడు. ఇది కాకుండా కౌలు సొమ్ము అదనం అని తెలిపారు. వీటన్నింటికీ నష్టపోయిన నగదును ప్రభుత్వమే ఇప్పించాలని రైతు డిమాండ్ చేస్తున్నారు.



ప్రతి ఏడాది తీసుకునే విత్తనాలతో ఏపుగా పెరిగిన పంట

• శాకంబరీ.. నమోస్తుతే!



శాకంబరీగా శ్రీమహంకాళి అమ్మవారు



ఈమనిలో గోగులమ్మ తల్లి

దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారు ఆదివారం భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఈవో కె.సునీల్ కుమార్ పర్యవేక్షించారు. ఈమని గ్రామ దేవత గోగులమ్మతల్లిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. – దుగ్గిరాల

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెను ప్రారంభించారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఆదివారం సమ్మె శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సమ్మెలోకి కార్మికులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సమ్మె కాలపు ఒప్పందాలను జీవోలు జారీ చేయాలని అన్నారు. సమ్మెకు మద్దతుగా ఎయిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.శ్రీనివాసరావు, కె.బుజ్జి పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఎం.బాలాజీ, వీవీ జవహర్‌లాల్, పల్లె కృష్ణ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు, ఎస్.నాగరాజు, పి.రాము, కేదారనాద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ప్రపంచ మేధావి బీఆర్ అంబేడ్కర్

ఫిరంగిపురం: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ ఆచార్య జి.కృపాచారి అన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ ప్రాంగణంలో ఆదివారం దళిత ఓపెన్ యూనివర్సిటీ 39వ స్నాతకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృపాచారి మాట్లాడుతూ.. భారత దేశం వివిధ రంగాల్లో ముందుకు దూసుకు వెళుతుందని తెలిపారు. అందుకు నిదర్శనం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ విధానాలని ఆయన పేర్కొన్నారు. ఓపెన్ యూనివర్సిటీకి 16 రాష్ట్రాలు, అనేక దేశాలలో మంచి గుర్తింపు ఉందన్నారు. యూనివర్సిటీ చైర్ పర్సన్ డాక్టర్. ఎం.స్వర్ణలతాదేవి మాట్లాడుతూ.. కార్డ్స్ సంస్థను పి.రంజన్‌బాబు స్థాపించి బడుగు, బలహీన వర్గాలు, గిరిజనులకు ఉచితంగా విద్యను అందించిన సేవాతత్పరుడని చెప్పారు. అదే విధంగా దళిత ఓపెన్ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని గుర్తించి వారికి అవార్డులు ఇచ్చి సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సన్మానించారు. ముందుగా వ్యవస్థాపకులు పుల్లగూర రంజన్ బాబు, దీనమ్మ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన డి.రమేష్, ఐఆర్ఎస్ అధికారి సీహెచ్, విక్టర్ మోజేస్, కె.మణిసింగ్, ఆర్.వేది, ఆదూరి వెంకటరత్నంలను అవార్డులతో ఘనంగా సన్మానించారు.



అవార్డులు అందుకున్న వారితో వైస్ ఛాన్సిలర్ ఆచార్య జి.కృపాచారి

నేడు యూనిఫాం పంపిణీ

తెనాలిఅర్బన్: రావినూతన ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రావినూతల వెంకుబాయమ్మ, కామేశ్వరమ్మ స్మారక మెమోరియల్ ట్రస్ట్, రోహిణి హాస్పటల్‌ల సంయుక్త సహకారంతో వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 65 మంది విద్యార్థినులకు వీటిని పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథులుగా చందోలు శంకరరావు, మాజీ జడ్పీటీసీ డాక్టర్ పృథ్వీలత, డాక్టర్ యామిని, దివ్య, రావినూతల ప్రకాష్, అన్నపూర్ణ, తదితరులు పాల్గొంటారని చెప్పారు.

విద్యతో ఉన్నత స్థితి



తెనాలిఅర్బన్: విద్యతో ఉన్నతస్థితికి చేరుకోవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ మురుగుడు శ్రీహరి పేర్కొన్నారు. పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం 142 మంది విద్యార్థులకు రూ.2.84 లక్షల విలువ చేసే నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మారుతున్న విద్య విధానానికి అనుగుణంగా అందరూ మారాల్సిన అవసరం ఉందన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. జొన్నాదుల నరసింహారావు, ఆదినారాయణ, గంజి ప్రభాకరరావు, దివి పురుషోత్తం, కటకం శేషగిరి, బట్టు నరేంద్రబాబు, పంచమర్తి భాస్కరరావు, దివి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరిట దూషించినందునే బలవన్మరణం

కొల్లిపర: దళిత యువకుడి ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తి గాయం శివారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలంటూ ఆదివారం మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద పెరికల దుర్గాప్రసాద్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శివారెడ్డి కులం పేరుతో దూషించాడనే కారణంగానే దుర్గాప్రసాద్ శనివారం పురుగు మందు తాగి మృతి చెందాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సీ నాయకులైన మారుమూడి విక్టర్ ప్రసాద్, యండ్రపాటి అశోక్‌కుమార్‌లతో మాట్లాడారు. ఇప్పటికే శివారెడ్డిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, కుటుంబ సభ్యులను తగిన న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో దళిత సంఘ నాయకులు నిరసనను విరమించారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు

తెనాలి: తెలుగు సినీ రంగంలో ఒక విలక్షణ నటుడిగా నటించిన ప్రతి పాత్రకు జీవం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు మరణం సినీ రంగానికే కాక తెలుగు ప్రజలకు కూడా విచారకరమని స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లక్కరాజు సాయి అన్నారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని సాయి గుర్తుచేసుకున్నారు. 1998లో సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ 'స్పందన' తరఫున ప్రముఖ నటుడు గోవిందరాజుల సుబ్బారావు స్మారక అవార్డును కోట శ్రీనివాసరావుకు ప్రదానం చేసినట్టు ఆ కార్యక్రమ జ్ఞాపకాలను వెల్లడించారు. కోట తనకు రాసిన ఉత్తరం, ఆనాటి ఫొటోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నటులు హేమంత్, రమణయ్యలు ఉన్నారు.



క్యూ ఆర్ కోడ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం

- చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళదాం
- మండల విస్తృత స్థాయి సమావేశంలో దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని బైపాస్ రోడ్‌లో గల నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాజిల్లా గుడివాడలో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గూండాలు దాడి చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళదామని పిలుపునిచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్ కరపత్రాలను ఆవిష్కరించారు.

ఏడాది పాలనకే విసుగెత్తిపోయారు..

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. ప్రభుత్వం తొలి అడుగు పేరుతో ఇంటింటికీ వచ్చే కూటమి నాయకులను ఎన్నికల ముందు ఇచ్చిన బాండ్లను చూపి నిలదీయాలన్నారు. అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని.. అధికారులు కూడా ఆ విషయం గుర్తించి చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, గుంటూరు జిల్లా యాక్టివిటీస్ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పంచాయతీరాజ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాం, మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు షేక్ గౌస్ మొహిద్దీన్, మంగళగిరి మండల యువజన విభాగం అధ్యక్షులు కొండమడుగుల గోపిరెడ్డి, మంగళగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గర్నెపూడి సుభాకర్, మంగళగిరి మండల ఉపాధ్యక్షులు షేక్ గౌస్, మండల ప్రధాన కార్యదర్శి అర్దాల చిన్నారి, వివిధ అనుబంధ విభాగ అధ్యక్షులు, మంగళగిరి మండలంలోని 14 గ్రామాల అధ్యక్షులు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి

తాడేపల్లి రూరల్: ఎన్నికలకు ముందు చంద్రబాబు, ఇతర మంత్రులు బాబు ష్యూరిటీ అంటూ సూపర్ సిక్స్‌ను మేనిఫెస్టోగా రూపొందించి ప్రచారం చేశారని.. నేడు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు నో గ్యారెంటీగా ఆ పథకం మిగిలిపోయిందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు 21, 22 వార్డుల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో ముఖ్యమంత్రి అయిన వెంటనే ఏడాదిలో ఇచ్చిన హామీలను నెరవేర్చారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోతు దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహసంధ్య, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షులు గాలయ్య, వేల్పుల ఎలీషా, షేక్ సర్దార్, కోడిపిల్లల బాలకోటయ్య, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంస్థల నాయకులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన..

దుగ్గిరాల: ఏడాది గడిచినా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోగా.. ప్రశ్నించి వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ సమావేశాన్ని దుగ్గిరాలలో ఆదివారం నిర్వహించారు. సామావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి ముఖ్యఅతిథులు పాల్గొన్నారు. దుగ్గిరాల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ మాట్లాడుతూ.. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రజాధరణ ఉన్న నాయకుడని కొనియాడారు. హనుమంతరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుపుతున్నారని.. ఏడాది గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని అన్నారు. ప్రతి కార్యకర్త బాబు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తాడిబోయిన శివ గోపయ్య, చిలువూరు ఫిలోమణి, నాళా వెంకట కృష్ణ, పి.సంసోనమ్మ, బాజీ, ధనుంజయ్, ఉప్పాల ఆనంద్‌బాబు, గంపల గంగాయాదవ్, షేక్ సుభాని, ఎ.నాగేశ్వరరావు, ఆళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

మంగళగిరి: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తి లేదని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ స్పష్టం చేశారు. ఆదివారం రూరల్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, భూదందాలు, సెటిల్‌మెంట్‌లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వదిలి సమాజంలో మంచి ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు ఏదైనా గొడవల్లో తలదూర్చినా, బెదిరింపులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.